సాక్షి
జనగామ
బుధవారం | 15 | అక్టోబర్ | 2025



బాలికలకు భరోసా..
ఈ విద్యాసంవత్సరం పీఎంశ్రీ పాఠశాలల్లో బాలికల సాధికారత, కౌమార దశ భద్రత క్లబ్‌లు ఏర్పాటు చేయాలని సమగ్రశిక్ష అధికారులు ఆదేశించారు. - IIలో▸



పేదల సంక్షేమమే ధ్యేయం
పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వం అందించే ఆర్థిక చేయూతను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కొండా సురేఖ అన్నారు. - IIలో▸

గరిష్టం/కనిష్టం
30°/21°

వాతావరణం
జిల్లాలో ఉదయం చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

బడి ఎట్లుంది?

ప్రభుత్వ పాఠశాలల తనిఖీలకు కొత్త ప్యానెల్ బృందాలు



- విద్యా నాణ్యత పెంపునకు పాఠశాల విద్యాశాఖ కొత్త మార్గదర్శకాలు
- తనిఖీ అధికారులుగా ఉపాధ్యాయులకే బాధ్యతలు
- అదనపు పనిభారం మోపడం సరికాదంటున్న ఉపాధ్యాయులు
- బోధనా సమయం తగ్గి విద్యార్థులకు నష్టమని అభ్యంతరం

జనగామ: ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, బోధనా నాణ్యత, విద్యార్థులు నేర్చుకునే స్థాయిని అంచనా వేసేందుకు టీచర్లతో కూడిన కొత్త ప్యానెల్ తనిఖీ బృందాల ఏర్పాటుకు సర్కారు కసరత్తు చేస్తోంది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశాలు పంపించారు. బోధనా నాణ్యత, రికార్డులు, విద్యార్థుల ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. దీంతో సర్కారు బడుల్లో విద్యా ప్రమాణాల అంచనా, బాధ్యతాయుత బోధనతో విద్య మరింత బలపడే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. కానీ దీనిపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

తనిఖీలు ఎలా..
జిల్లాలో ప్రతీ మూడు నెలలకోసారి 150 పాఠశాలలు తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఇందులో 100 ప్రాథమిక, ప్రాథమికోన్నత, 50 ఉన్నత పాఠశాలలను తనిఖీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తనిఖీల్లో బోధన, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, విద్యా ఫలితాలు, శుభ్రత, పాఠశాల రికార్డులు, పాఠ్య ప్రణాళిక అమలు, డిజిటల్ క్లాస్ తరగతుల వినియోగం వంటి అంశాలు సమగ్రంగా పరిశీలించాలి. పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో టీచర్లతో కూడిన కమిటీలు ఏర్పాటు చేయాలి.



జనగామ పట్టణం రైల్వేస్టేషన్ ఏరియా ప్రభుత్వ పాఠశాల

ప్రాథమిక పాఠశాలల్లో..
జిల్లాలో 343(పీఎస్), 64(ప్రాథమికోన్నత), 103 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 29, 500 మంది పిల్లలు చదువుకుంటున్నారు. ప్రాథమిక పాఠశాలల పరిధిలో ప్రధానోపాధ్యాయుడు(నోడల్ అధికారి), ఇద్దరు ఎస్జీటీలు సభ్యులుగా ఉంటారు. ప్రాథమికోన్నత బడుల్లో స్కూల్ అసిస్టెంట్(నోడల్ అధికారి), ప్రధానోపాధ్యాయుడు, ఒక ఎస్జీటీ సభ్యులుగా ఉంటారు. ఉన్నత పాఠశాలల్లో గెజిటెడ్ హెడ్‌మాస్టర్(నోడల్ అధికారి), ఏడుగురు సబ్జెక్టు టీచర్లు, ఒక ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ సభ్యులుగా పర్యవేక్షణ చేయను న్నారు.

తనిఖీ అధికారుల పర్యవేక్షణ కోసం షరతులు..
తనిఖీ బృందాల్లో పనిచేసే టీచర్ల అర్హతలపై కఠిన నియమావళి విధించారు. జిల్లా స్థాయిలో ఎంపికయ్యే తనిఖీ అధికారులకు ఈ షరతులు తప్పనిసరి అంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కనీసం 10 ఏళ్ల బోధన అనుభవం కలిగి ఉండడంతో పాటు డిజిటల్ అక్షరాస్యత, కంప్యూటర్ పరిజ్ఞానం తప్పక ఉండాలి. సదరు టీచర్లపై విధి నిర్వహణలో క్రమశిక్షణా చర్యలు లేని ఉత్తమ వ్యక్తిగా ఉండాలి. బోధనా నాణ్యతపై ఆసక్తి, మానవతా దృక్పథం కలిగి ఉండి, ఆయా శిక్షణా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఉండాలి. పాఠశాల తనిఖీ బృందాల ఎంపికను కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ నేతృత్వంలో చేపడతారు. తనిఖీ బృందాలకు ఎంపికైన ఉపాధ్యాయులు పూర్తి సమయం పనిచేయాల్సి ఉంటుంది. కమిటీల ఏర్పాటుతో పాఠశాలల్లో బోధన తరగతులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకోవాలి.

తనిఖీ కమిటీలపై ఉపాధ్యాయుల ఆగ్రహం

విద్యాశాఖ నాలుగు రోజుల క్రితం జారీ చేసిన పాఠశాలల తనిఖీ కమిటీల నియామకంపై ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి వెల్లువెత్తుతోంది. బోధన, విద్యార్థుల ఫలితాలు, హాజరు తదితర అంశాలను పరిశీలించేందుకు ఉపాధ్యాయులకే తనిఖీ బాధ్యతలు అప్పగించడం అనవసరమని వారు మండిపడుతున్నారు. టీచర్లపై ఇప్పటికే అనేక తనిఖీల బాధ్యతలు ఉన్న సమయంలో అదనపు భారం మోపడం సరైంది కాదంటున్నారు. దీనివల్ల తరగతులు బోధించడానికి సమయం తగ్గి, విద్యార్థులు నేర్చుకునే స్థాయి దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు బోధకులకే తనిఖీ పనులు అప్పగించడం వల్ల సహచరుల మధ్య అవగాహన దెబ్బతిని, పాఠశాల వాతావరణంలో విభేదాలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. మొత్తం మీద ఉపాధ్యాయుల తనిఖీ కమిటీల నియామకం రాష్ట్ర విద్యావ్యవస్థలో కొత్త చర్చకు దారితీస్తోంది.

బోధనా ప్రామాణికత దెబ్బతింటుంది..



ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలను ఉపాధ్యాయులపై వేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని జూన్‌లో ప్రభుత్వానికి విన్నవించాం. టీచర్లు ఇప్పటికే బోధన బాధ్యతలతో పాటు పలు పరిపాలనా పనులు నిర్వర్తిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలను మోపితే బోధనా ప్రామాణికత దెబ్బతింటుంది. డీఈఓలు, డిప్యూటీ ఈఓలు, ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు వంటి అధికారులను వినియోగించాలి. అవసరమైతే ప్రత్యేకంగా పోస్టులను సృష్టించాలి.

- మడూరి వెంకటేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, టీఎస్‌యూటీఎఫ్

పాఠాలు ఎవరు చెప్పాలి..?



టీచర్లకు పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతను అప్పగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే నిలిపివేయాలి. పాఠశాలల పనితీరును పర్యవేక్షించడానికి ఎస్జీటీ, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్‌లకు బాధ్యతలు అప్పగించడం సరైంది కాదు. విద్యారంగంలో సంక్షోభానికి దారితీస్తుంది. సంవత్సరం పొడవునా టీచర్ల సేవలను ఈ విధంగా ఉపయోగించుకోవడం వల్ల వారు పని చేస్తున్న పాఠశాలలో బోధన కుంటుపడుతుంది.

- ఎస్ఎస్ రాజు, జిల్లా అధ్యక్షుడు, టీపీటీఎఫ్

వరంగల్‌కు నేడు సీఎం రేవంత్

- మధ్యాహ్నం 1 గంటకు హనుమకొండకు
- 2 గంటలకు తిరుగు పయనం
- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని పరామర్శించనున్న సీఎం



సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బుధవారం వరంగల్ నగరానికి రానున్నారు. కాజీపేటలోని పీజీఆర్ గార్డెన్స్‌లో జరిగే నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి తల్లి కాంతమ్మ దశదిన కర్మ కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారు. ఈ మేరకు సీఎం పర్యటన షెడ్యూల్‌ను విడుదల చేశారు. సీఎం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసంనుంచి డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ హెలిపాడ్‌కు బయలుదేరుతారు. 12.15 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 1.00 గంటలకు హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలోని హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడినుంచి 1.05 గంటలకు కాజీపేట ప్రశాంత్‌నగర్‌లోని పీజీఆర్ గార్డెన్స్‌కు చేరుకుంటారు. 1.15 – 1.45 గంటల వరకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డిని పరామర్శించి ఆయన తల్లి 'మాతృయజ్ఞం' కార్యక్రమంలో పాల్గొంటారు. 1.45 గంటలకు పీజీఆర్ గార్డెన్స్‌నుంచి బయలుదేరి 2.00 గంటలకు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చేరుకుంటారు. అక్కడినుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారు.



పీజీఆర్ గార్డెన్స్‌లో బందోబస్తు చర్యలపై అధికారులతో చర్చిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

భద్రతా ఏర్పాట్ల పరిశీలన
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, పీజీఆర్ గార్డెన్స్ ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ బృందాలతో తనిఖీలు నిర్వహించారు. సీపీవెంట జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, రెవెన్యూ అధికారి వైవీ గణేష్, ఏసీపీలు పింగిళి ప్రశాంత్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

'బెస్ట్ అవైలబుల్' పరిష్కారానికి కృషి

- వీసీలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

జనగామ రూరల్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులకు విద్యాబోధనలో ఇబ్బందులు కలగకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ఉన్న ఇబ్బందుల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. విద్యార్థులకు విద్యా బోధనలో ఆటంకాలు కలిగించవద్దని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, బెస్ట్ అవైలబుల్ స్కూల్ యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాముఖ్యం ఇస్తోందని, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు మెరుగైన మౌలిక వసతులతో కూడిన విద్యా బోధన అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, డీఎస్‌డీఓ విక్రమ్ పాల్గొన్నారు.

సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

జనగామ రూరల్: మీ సేవలో స్లాట్ బుకింగ్ చేసుకున్న దివ్యాంగులు యుడీఐడీ(యూనిక్ డిజెబిలిటీ ఐడెంటీ) సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వసంత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త, రెన్యూవల్ వారు మీ సేవలో యూడీఐడీ వెబ్‌సైట్‌లో స్లాట్ బుకింగ్ చేసుకున్న వారు రసీదులో ఉన్న ఫోన్ నెంబర్‌కు మెసేజ్ వచ్చిన తేదీల్లో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సదరం శిబిరానికి హాజరుకావాలని కోరారు. ఈనెల 15,16, 17,22,23,24,25,28,29,30, 31వ తేదీల్లో ఆర్థో, దృష్టి , వినికిడి లోపం, మానసిక, తలసేమియా, క్రానిక్ న్యూరాలజీ, సంబంధిత దివ్యాంగులకు క్యాంపులు నిర్వహించబడుతాయన్నారు. మరిన్ని వివరాలకు 80082 02287 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

డిజిటల్ లిటరసీతో బోధన సులువు

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానం అవసరమని అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు డిజిటల్ విద్యపై అవగాహన పొందాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న ఏకశిల బీఈడీ కళాశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో డిజిటల్ లిటరసీపై ఫిజిక్స్ ఉపాధ్యాయులకు మూడు రోజులపాటు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.. మారుతున్న సమాజానికి అనుగుణంగా విద్యా బోధన కూడా మారాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ విద్యకు పాఠశాలల్లో కంప్యూటర్లు ఉన్నాయని, పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌బీ డిజిటల్ ప్యానెల్స్ కూడా వినియోగించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏఎంఓ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనుల పరిశీలన
మండలంలోని పెంబర్తి గ్రామం వద్ద రూ.5కోట్లతో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌తో కలిసి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..నిర్మాణ పనులు వేగవంతంగా జరగాలని జాప్యం తగదన్నారు. కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రంజిత్ తదితరులు ఉన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు ఇవ్వండి

- సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్‌ను కోరిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: జిల్లాలో సాగునీటి వనరులను సద్వినియోగం చేసుకుని రైతుల సాగుకు ఊతమిచ్చి పంటల ఉత్పత్తిని పెంచేందుకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్ ఆధ్వర్యంలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పలు సమస్యలపై వినతి చేశారు. జనగామ నియోజకవర్గ పరిధిలోని తరిగొప్పుల మినీ లిఫ్ట్–1 పనులకు సంబంధించిన పైప్‌లైన్ పనులు పూర్తైనప్పటికీ, మరిన్ని చెరువులకు అనుసంధానం చేసే విధంగా పైపులైన్ల నిర్మాణం చేపట్టాలన్నారు. అంతే కాకుండా పంపు హౌస్ నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేసి రైతులకు సాగు నీటిని అందించాలని మంత్రిని కోరినట్లు స్పష్టం చేశారు. వచ్చే ఏడాది సంక్రాంతి పండుగ లోపు పనులను పూర్తి చేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. దేవాదుల 8వ ప్యాకేజీలో తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి బచ్చన్నపేట, చేర్యాల(మండల పరిధిలో కాలువలు), కన్నెబోయినగూడెం రిజర్వాయర్ నుంచి బచ్చన్నపేట, జనగామ మండలాల్లో అసంపూర్తిగా ఉన్న కాలువలను పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. జనగామ నియోజకవర్గంలో 12 చెరువులకు అత్యవసర మరమ్మతులు అవసరం పడ్డాయని, వాటి పునరుద్ధరణ పనులు సత్వరమే చేపట్టడానికి నిధులను విడుదల చేయాలని మంత్రిని కోరడం జరిగిందన్నారు. మల్లన్న సాగర్ నుంచి తపాస్‌పల్లి గ్రావిటీ కాలువ పనులను పునరుద్ధరించాలని వినతిలో పేర్కొన్నట్లు తెలిపారు. తమ వినతికి సంబంధించి అన్ని పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రి ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వాగులకు అడ్డంగా చెక్ డ్యాంలతో పాటు చీటకోడూరు రిజర్వాయర్ గేట్లు, పెంబర్తి పెద్ద చెరువు, ఎల్లంల ఏనె చెరువు శాశ్వత పునరుద్ధరణ, జనగామ మండలం పెద్దపహాడ్ పెరుమాండ్ల చెరువు, మరిగడి, తరిగొప్పుల మండలం చింతల చెరువు, అంకుశాపూర్, నాగుల చెరువు, కర్షక కుంట(నర్మెట), బయ్యన్న చెరువు (ఎమర్జెన్సీ రిపేర్) పునరుద్ధరణ పనులకు రూ.7.13 కోట్లు విడుదల చేయాలని ప్రతిపాదన కాపీలను ఎమ్మెల్యే మంత్రికి అందించారు.



సమీక్షలో మంత్రి ఉత్తమ్‌తో ఎమ్మెల్యే పల్లా

బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.24.30 కోట్లు

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి మంజూరు జీఓ అందించిన మంత్రి అడ్లూరి

పాలకుర్తి టౌన్: పాలకుర్తి నియోజకవర్గంలోని గిరిజన తండాలు, గూడేలలో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.24.30 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కలిసి నియోజకవర్గ గిరిజన ప్రాంతాల అభివృద్ధి అంశాలపై ప్రతిపాదనలు అందజేశారు. బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.24.30 కోట్ల విలువైన ప్రభుత్వ జీఓ ఉత్తర్వులను మంత్రి లక్ష్మణ్ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి అందజేశారు. గతంలో రూ.6కోట్లు కలిపి ఇప్పటివరకు రూ.30.30 కోట్ల నిధులను మంజూరు చేసినందుకు మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.



నిధుల మంజూరు జీఓను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి అందజేస్తున్న మంత్రి అడ్లూరి

విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

జనగామ: జిల్లా కేంద్రంలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు బృందం మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. విజిలెన్స్ డీఎస్పీ మల్లయ్య ఆధ్వర్యంలో సీఐలు అనిల్, రాజేశ్, ఏఎంవీఐ మహేశ్‌గౌడ్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ అనిత టీములు వాహనాలను తనిఖీ చేశాయి. ఇందులో 13 వాహనాలను తనిఖీ చేసి, ఆర్టీసీ బస్టాండు షెడ్డుకు తరలించారు.



తనిఖీ చేసిన వాహనాలతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం

ప్రజాప్రభుత్వంలోనే రైతులకు మేలు

- ఏఎంసీలో ఐకేపీ సెంటర్లను ప్రారంభించిన చైర్మన్ శివరాజ్‌యాదవ్

సాక్షి ఎఫెక్ట్

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో చీటకోడూరు, శామీర్‌పేట గ్రామాలకు చెందిన రెండు ఐకేపీ ధాన్యం కొనుగోలు సెంటర్లను ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ ప్రారంభించారు. 'ఆరుగాలం వరద పాలు–భారీ వర్షంతో మార్కెట్ యార్డులో కొట్టుకుపోయిన మక్కలు, ధాన్యం' శీర్షికన సాక్షిలో ప్ర చురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం యార్డులో సెంటర్లను ప్రారంభించిన అనంతరం శివరాజ్ మాట్లాడారు.. వ్యవసాయ మార్కెట్ యార్డులో మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు కోసం రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఏఎంసీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి జీవన్ కుమార్, ఏడీఈ అపర్ణ, ఏపీఎం శంకరయ్య, ఏఎంసీ డైరెక్టర్లు నామాల శ్రీనివాస్, బొట్ల నర్సింగరావు, రమేశ్ యాదవ్, బండ కుమార్, రవీందర్, పర్ష సిద్దేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, రైతు నాయకులు చందూనాయక్ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

భూదాన్ భూములను గుర్తించాలి

- ఆర్డీఓ గోపీరామ్

బచ్చన్నపేట: జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని భూదాన్ భూములను రెవెన్యూ అధికారులు గుర్తించాలని జనగామ ఆర్డీఓ గోపీరామ్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని పోచన్నపేట, ఆలింపూర్ గ్రామాలలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల బృందంతో కలిసి భూదాన్ భూములను గుర్తించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీఓ పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ.. భూదాన్ భూములు గల గ్రామాలను గుర్తించి ఆ గ్రామాలలో భూములు ఏ సర్వేనెంబర్‌లో ఉన్నాయో అక్కడకు వెళ్లి హద్దులను నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఖాళీగా స్థలాలకు ఫెన్సింగ్ కూడా వేయిస్తామన్నారు. కార్యక్రమంలో డీఐ రాజు, తహసీల్దార్ రామానుజాచారి, ఎంఆర్‌ఐ వంశీకృష్ణ, సర్వేయర్లు నర్మద, శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఇటుక మేడపై ఇస్మార్ట్ బాయ్స్

ఇటుకలపై మొబైల్ మాయలో బాల్యం..ఊహ తెలియని వయసులో ఆటలు మర్చిపోయి, స్మార్ట్‌ఫోన్లలో మునిగిపోయిన చిన్నారులు..ఇంటి నిర్మాణం కోసం పేర్చిన ఇటుకలపై కూర్చొని టెక్నాలజీతో గడుపుతున్న క్షణాలు...ఈ దృశ్యంలో బాల్యంలో మారుతున్న జీవనశైలి, డిజిటల్ యుగం ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. మారుతున్న సమాజానికి ప్రతిబింబంగా నిలుస్తోంది. జనగామ పట్టణం వీవర్స్ కాలనీలో ఇటుకలపై ఇద్దరు చిన్నారులు కూర్చుని సెల్‌ఫోన్‌లో నిమగ్నమైన ఘటన కనిపించింది. - జనగామ

న్యూస్‌రీల్

ముగిసిన శ్రీలక్ష్మీనర్సింహుడి బ్రహ్మోత్సవాలు



జఫర్‌గఢ్: మండల కేంద్రంలో పడమర కొండ దిగువన ఉన్న శ్రీలక్ష్మీనర్సింహ సీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు పుష్పయాగంతో సోమవారం రాత్రి ఘనంగా ముగిశాయి. నాలుగు రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. చివరి రోజున సుప్రభాతం, సేవాకాలం, ప్రబోధకి, శాంతిహోమం, మహాపూర్ణాహుతి, చక్రతీర్థం నిర్వహించడంతో పాటు రాత్రి సమయంలో పుష్పయాగాన్ని నిర్వహించారు. 12 రకాల పుష్పాలతో నిర్వహించిన పుష్పయాగం కనుల పండువగా సాగింది. పుష్పయాగం అనంతరం మంగళవాయిద్యాల మధ్య స్వామివారి ఉత్సవ విగ్రహాలతో పల్లకీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు చేసిన గోవిందా నామస్మరణతో ఆలయ ప్రాంగణం హోరెత్తింది. కార్యక్రమంలో ఆలయ పూజారులు వెంకటాచార్యులు, శ్రీనివాసచార్యులు, కృష్ణమాచార్యులతో పాటు గ్రామ ప్రముఖులు, భక్తులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఎస్ఈగా సీతారాం



జనగామ: జనగామ ఇరిగేషన్ ఎస్ఈగా భూక్యా సీతారాంను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా నీటి పారుదల వాఖలో పని చేస్తున్న ఇంజనీర్లను బదిలీ చేయగా, ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని అందులో పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఓడీ ప్రాతిపదికన పని చే యాలని సూచించారు.

జనగామ నుంచి పుట్టపర్తికి ఆర్టీసీ బస్సు

జనగామ: సత్యసాయిబాబా జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పుట్టపత్రికి వచ్చే నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలకు జనగామ జిల్లా కేంద్రం నుంచి ఆర్టీసీ బస్సు బయలుదేరుతుందని డిపో మేనేజర్ ఎస్. స్వాతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో వ్యక్తికి టికెట్ ధర రూ.2వేలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. మరిన్ని వివరాల కోసం కె.సురేందర్ (సేఫ్టీ వార్డెన్)-9948164847, ఎం.ఉప్పలయ్య(ఏడీసీ)-7382852933 నెంబర్లను సంప్రదించాలన్నారు.

అర్చక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పాలకుర్తి టౌన్: రాష్ట్రంలోని దేవాలయాల అర్చక, ఉద్యోగులకు పెన్షన్, హెల్త్‌కార్డులు ఇవ్వాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్‌శర్మ కోరారు. మంగళవారం హన్మకొండలోని మంత్రి కొండా సురేఖను ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవీఆర్‌శర్మ మాట్లాడుతూ.. దేవాదాయ శాఖలో వేల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఒక్క ఈఓకు 10 నుంచి 25 దేవాలయాల బాధ్యతలు ఉండడంతో పాలన ఇబ్బందిగా మారిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మంత్రిమండలి సమావేశంలో 190 గ్రేడ్ 1,2,3 ఈఓ పోస్టుల మంజూరుకు సంబంధించిన తీర్మానం చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బేతి రంగారెడ్డి, నాయకులు తక్కర్సు సత్యం, శ్యాంకుమార్, జైపాల్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్(ఏపీఆర్వో), ఫొటోగ్రాఫర్‌గా ఆరు నెలల కాలానికి మార్చి 31, 2026 వరకు పనిచేసేందుకు అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌కు జర్నలిజంలో ప్రభుత్వ గుర్తింపు సంస్థల నుంచి పొందిన డిగ్రీ లేదా జర్నలిజంలో డిప్లొమా చేసి ఉండడంతో పాటు, ప్రభుత్వ కార్యక్రమాల కవరేజ్, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ పాత్ర మొదలగు అంశాల మీద అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫొటోగ్రాఫర్‌కు సంబంధించి ప్రభుత్వ గుర్తింపు సంస్థల నుంచి పొందిన డిగ్రీతో పాటు జర్నలిజంలో, ఫొటోగ్రఫీలో డిప్లొమా ఉండాలన్నారు. లిఖిత పరీక్ష కూడా ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు 17వ తేదీలోగా జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

దీప్తి.. ఘనకీర్తి

● మరో గోల్డ్ మెడల్ సాధించిన భారత పారా అథ్లెట్


గోల్డ్ మెడల్స్‌తో జివాంజీ దీప్తి

పర్వతగిరి: ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో జరుగుతున్న విర్చ్యూస్ వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్–2025లో వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన పారా అథ్లెట్ జివాంజీ దీప్తి మరో గోల్డ్ మెడల్ సాధించారు. ఇటీవల టీ–20 విభాగంలో 400మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్ సాధించగా, మంగళవారం జరిగిన 200మీటర్లపరుగు పందెంలో మరో గోల్డ్ మెడల్ సాధించింది. దీప్తి పలు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకుంది. దీనిపై తల్లిదండ్రులు, గ్రామస్తులు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

బీసీ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్‌గా వేణుగోపాల్ గౌడ్



హన్మకొండ: తెలంగాణ స్టేట్ బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్‌గా వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్‌ను నియమించినట్లు ఆ జేఏసీ రాష్ట్ర కార్యనిర్వాహక చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బీసీ ఉద్యమంలో చురుకుగా పాల్గొంటున్న హనుమకొండ నయీంనగర్‌కు చెందిన వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్‌ను ఈ పదవిలో నియమిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. కాగా, బీసీలను రాజకీయంగా ఎదగకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అడ్డుకుంటున్న వారికి తగిన బుద్ధి చెబుతామని వేణుగోపాల్ గౌడ్ అన్నారు. తనను ఈ పదవిలో నియమించిన జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య, కార్య నిర్వాహక చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ నారగోని, కోచైర్మన్లు రాజారాం యాదవ్, దాసు సురేశ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పాత ఫీజులనే కొనసాగిస్తాం

● రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం

కేయూ క్యాంపస్ : గత విద్యాసంవత్సరంలోని కామన్ సర్వీస్, పరీక్ష ఫీజులనే కొనసాగిస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ పరిధిలో 2025–26 విద్యాసంవత్సరానికి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ కోర్సుల (నాన్ ప్రొఫెషనల్) కామన్ సర్వీస్, పరీక్ష ఫీజులను పెంపుదలపై వివిధ విద్యార్థి సంఘాలు, విద్యార్థులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో 2024–25లో ఉన్న ఫీజులనే కొనసాగిస్తామన్నారు. యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు తమ కళాశాలల విద్యార్థులకు కూడా తెలియజేయాలని రిజిస్ట్రార్ కోరారు.

చేపల వల కాలికి తట్టుకొని యువకుడి మృతి


ఉపేందర్ (ఫైల్)

గార్ల : కాలికి చేపల వల తట్టుకొని చెరువులో పడి ప్రమాదవశాత్తు ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్ జిల్ల గార్ల మండలం గోపాలపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాంపాటి ఉపేందర్ (32), అదే గ్రామానికి చెందిన నర్సయ్యతో కలిసి సమీపంలోని అప్పసముద్రం చెరువులో రాత్రివేళ చేపల వేటకు వెళ్లారు. అయితే ఇద్దరిలో నర్సయ్య ఒక్కడే ఇంటికి వచ్చి నిద్రించాడు. ఉదయమైనా ఉపేందర్ ఇంటికి రాకపోవడంతో మృతుడి తల్లి కోటమ్మ కుటుంబ సభ్యులతో కలిసి చెరువులో గాలించగా, ఉపేందర్ శవమై కనిపించాడు. మృతుడి కాళ్లకు చేపల వల చుట్టుకొని చనిపోయి ఉన్నాడు. మృతుడితో కలిసి వెళ్లిన నర్సయ్యను పోలీసులు స్టేషన్‌కు పిలిచి విచారించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి తల్లి ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్కే రియాజ్ పాషా తెలిపారు.

బాలికలకు భరోసా..

● ఒక్కో పాఠశాలకు రూ. 15 వేల చొప్పున మంజూరు
● నేటి నుంచి అమలుకు ఉపక్రమణ

పీఎంశ్రీ స్కూళ్లలో విద్యార్థినుల సాధికారత, కౌమారదశ భద్రతాక్లబ్‌లు ఏర్పాటు



విద్యారణ్యపురి : 2025–2026 విద్యాసంవత్సరంలో పీఎంశ్రీ పాఠశాలల్లో ఇక బాలికల సాధికారత, కౌమార దశ భద్రతాక్లబ్‌లు ఏర్పాటుచేసుకోవాల్సి ఉంటుంది. ఈమేరకు సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్‌నికోలస్ సంబంధిత జిల్లావిద్యాశాఖాధికారులను ఇటీవల ఆదేశించారు. దీంతో ఉమ్మడివరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల్లో బాలికల సాధికారత, కౌమారదశ భద్రతాక్లబ్‌లు ఏర్పాటుచేయబోతున్నారు.

ఈ క్లబ్‌ల ముఖ్య ఉద్దేశం

- బాలికలకు కౌమారదశలో ఆరోగ్యం, హైజిన్, లైంగిక అంశాలపై అవగాహన కల్పించడం.
- ఆర్థిక, న్యాయ,సైబర్ భద్రత, డ్రగ్స్, మానసిక ఆరోగ్యం, కేరీర్‌పై విద్యార్థినులకు శిక్షణ
- పాఠశాలల్లో ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ ఏర్పాటు, పోలీస్ లింకేజీతో బాల్యవివాహాలు, సైబర్ సమస్యలను గుర్తించి నివేదిక ఇవ్వడం లాంటి అంశాలు క్లబ్‌లు చేయాల్సి ఉంటుంది.

కౌమారదశ భద్రత క్లబ్ నిర్మాణం..

- జిల్లాల్లోని పీఎంశ్రీ పాఠశాలలో క్లబ్ నిర్మాణం ఇలా ఉంటుంది. ప్రతీతరగతి నుంచి ఇద్దరు విద్యార్థులు, (బాలుడు, బాలిక), ఒక మహిళా, ఒక పురుష ఉపాధ్యాయులు గైడ్‌గా ఉంటారు
- హెడ్మాస్టర్ క్లబ్‌చైర్మన్‌గా, స్థానిక పోలీస్‌కానిస్టేబుల్ బాహ్యసభ్యుడుగా ఉంటారు. ప్రతీపాఠశాలలో 14నుంచి 16 మంది సభ్యులు ఉండేలా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది.

పీఎంశ్రీపాఠశాలలో గ్రీవెన్స్ బాక్స్‌లు

పీఎంశ్రీపాఠశాలల్లో గ్రీవెన్స్‌బాక్స్‌లు ఏర్పాటుచేయాల్సింటుంది. బాలికల కోసం ప్రత్యేకంగా ఫిర్యాదులకు ఒకబాక్స్, సాధారణ ఫిర్యాదులకోసం మరో బాక్స్‌ను ఏర్పాటు చేస్తారు. వేధింపులు, చైల్డ్ మ్యారేజ్, సైబర్‌మోసం వంటి సమస్యలను నివారించేందు కుగాను చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

క్లబ్‌ల ఏర్పాటు నేటినుంచి అమలులోకి..

పీఎంశ్రీస్కూళ్లలో ఈ క్లబ్‌ల ఏర్పాటు ఈనెల 15నుంచి అమలులోకి తీసుకురానున్నారు. నెల వారీగా ఏయే కార్యక్రమాలు చేపట్టాలనేది పలు అంశాలు ఉన్నాయి. అక్టోబర్‌లో బాలల లైంగిక దుర్వినియోగం, ఆరోగ్యం, ఆర్థిక సాక్షరతపై అవగాహన కల్పిస్తారు. నవంబర్‌లో న్యాయసాక్షరత, సైబర్ భద్రత, స్వీయరక్షణ, డిసెంబర్‌లో మానసిక ఆరోగ్యం, 2026 జనవరిలో జీవన నైపుణ్యాలు, బాల్యవివాహాలు, నేషనల్ గర్ల్స్ చైల్డ్‌డే పై అవగాహన కల్పిస్తారు. ఫిబ్రవరిలో కేరీర్ మార్గనిర్దేశంపై అవగాహన కల్పిస్తారు. పలు అంశాలు ఆన్‌లైన్‌లోకూడా సెషన్లు టీసాట్ ద్వారా నిర్వహిస్తారు. ఇందుకు కూడా షెడ్యూల్ ప్రకారం కొనసాగనుంది. తెలంగాణ రాష్ట్రంలో 658 పీఎంశ్రీ స్కూళ్లలో బాలికల భద్రత సురక్షిత వాతావరణం, సఫలీకరణకు దోహదపడే గర్ల్స్ చైల్డ్ ఎంపవర్‌మెంట్, అడోలోసెంట్ సేఫ్టీ క్లబ్స్ (సీజీఈఏఎస్‌సీఎస్) ఏర్పాటుచేస్తారు.

ప్రతీ పీఎంశ్రీ పాఠశాలకు రూ.15వేలు

బాలకలసాధికారత, బాలికల కౌమారదశభద్రతాక్లబ్‌లను ఏర్పాటుచేస్తున్న ఆయాపీఎంశ్రీ పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు రూ. 15వేల చొప్పున మంజూరు చేశారు.ఆయానిధులు ఎలా వినియోగించుకోవాలో కూడా ఆయాపాఠశాలల హెచ్‌ఎంలకు సమాచారం అందించారు. ఈనెల 15వరకు క్లబ్ ఏర్పాటు నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. పీటీఎం సమావేశాల్లో ఈ అంశాన్ని చర్చించాల్సింటుంది. కలెక్టర్ ఆధ్వర్యంలో లైన్ డిపార్టుమెంట్లతో సమన్వయం జరగాల్సి ఉంటుంది. జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్, లింగసమానత్వం కోఆర్డినేటర్ పర్యవేక్షిస్తారు.

ఈ క్లబ్‌ల నిర్మాణం జరిగే పీఎం శ్రీ స్కూళ్ల సంఖ్య జిల్లాల వారీగా ఇలా

జిల్లా	పాఠశాలల సంఖ్య
హనుమకొండ	13
వరంగల్	14
జనగామ	15
మహబూబాబాద్	21
ములుగు	08
జయశంకర్ భూపాలపల్లి	07

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, పక్కన వరంగల్ డీఆర్‌ఓ విజయలక్ష్మి, తదితరులు

● రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

ఖిలా వరంగల్ : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పేదింటి ఆడపిల్లల పెళ్లికి ప్రభుత్వం అందించే ఆర్థిక చేయూతను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈమేరకు మంగళవారం వరంగల్ 35వ డివిజన్ శివనగర్‌లోని సాయి కన్వెన్షన్ హాల్‌లో తహసీల్దార్లు శ్రీకాంత్, ఇక్బాల్ అధ్యక్షతన వరంగల్, ఖిలా వరంగల్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తూర్పు నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. తూర్పులో 500 మందికి పైగా లబ్ధిదారులకు రూ.5,30,61,480 విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, రూ.35,37,700 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులతోపాటు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు ధ్రువ పత్రాలు అందజేశామని తెలిపారు. డీఆర్‌ఓ విజయలక్ష్మి, బల్దియా ఉప కమిషనర్ ప్రసన్నా రాణి, కార్పొరేటర్లు సోమిశెట్టి ప్రవీణ్, వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమ, పోశాల పద్మ, చింతాకుల అనిల్, దిడ్డి కుమారస్వామి, కావేటి కవిత, పల్లం పద్మ, గుండు చందన ,నాయకులు శామంతుల శ్రీనివాస్, గోపాల నవీన్‌రాజు, మీసాల ప్రకాశ్ పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా..

● చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠా అరెస్ట్
● బంగారం, వెండి ఆభరణాలు, ఆటో, బైక్ స్వాధీనం
● వివరాలు వెల్లడించిన పోలీసులు


దొంగల ముఠా అరెస్ట్ చూపుతున్న ఏసీపీ రవీందర్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్, ఆర్టీసీ కాలనీకి చెందిన మాదాసు నవీన్, మాదాసు భార్గవి, భద్రాద్రికొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం కొండైగూడెం గ్రామానికి చెందిన కుంజా విజయ, పాల్వంచకు చెందిన బత్తుల రాజేశ్వరి ముఠాగా ఏర్పడి తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. సెప్టెంబర్ 20న పాకాల సెంటర్‌లోని తాళం వేసి ఉన్న షాపులో నగలు అపహరించారు. అలాగే, ఆగస్టులో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రామాలయం దగ్గర రైల్వే క్వార్టర్స్‌లోని ఓ ఇంట్లో, అదే నెల రెండో వారంలో ఖానాపురం మండలం బుధరావుపేటలోని ఓ ఇంట్లోకి చోరీకి పాల్పడ్డారు. అనంతరం అపహరించిన బంగారు, వెండి వస్తువులను విక్రయించేందుకు మహబూబాబాద్ నుంచి నర్సంపేట మీదుగా వరంగల్ వెళ్తున్నారు. ఇందులో మహమ్మద్ ఇమ్రాన్ ద్విచక్ర వాహనంపై, మిగతా నలుగురు ఆటోలో వెళ్తున్నారు. ఈ సమయంలో వీరిపై అనుమానం కలగడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. దీంతో వారి వద్ద నుంచి మొత్తం రూ. 4 లక్షల 30 వేల విలువైన ద్విచక్రవాహనం, ఆటో, 5 సెల్‌ఫోన్లు, బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు రవికుమార్, గూడ అరుణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అథ్లెట్లకు అసౌకర్యం కలగొద్దు

● ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
● 16 నుంచి జాతీయస్థాయి అథ్లెటిక్స్ మీట్
● జేఎన్‌ఎస్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, మేయర్ సుధారాణి, కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా మూడు రోజులపాటు జరుగనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌నకు హాజరయ్యే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు అండర్–23 నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ జరుగనున్న నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, మేయర్ సుధారాణి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు వెయ్యి మంది అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ నేపథ్యంలో నేషనల్ మీట్‌ను విజయవంతంగా పూర్తి చేయాలని, క్రీడాకారులకు తాగునీరు, వైద్యం, పరిశుభ్రత, లైటింగ్ తదితర సౌకర్యాలను కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్ కుమార్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఎంహెచ్‌ఓ రాజిరెడ్డి, ఈఈ రవీందర్, డీఈ సారంగం, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'దొంతి'కి మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శ


కాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు నాగరాజు, గండ్ర

నర్సంపేట: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం రాత్రి పరామర్శించారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి తల్లి దొంతి కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మంత్రి శ్రీధర్‌బాబు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి గాజర్ల అశోక్‌కుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మంగళవారం వేర్వేరుగా కాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించి ఎమ్మెల్యే మాధవరెడ్డిని పరామర్శించారు.

అన్‌మ్యాన్డ్ వర్కర్ కుటుంబానికి ఆర్థిక సాయం


ప్రియాంకకు బీమా చెక్కు అందజేస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: విధి నిర్వహణలో ప్రాణం కోల్పోయిన టీజీ ఎన్పీడీసీఎల్ అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ గట్ల కరుణాకర్ రెడ్డి కుటుంబానికి ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆర్థిక సాయం అందించారు. మహబూబాబాద్ మండలం ఈదులపూసలపల్లి గ్రామానికి చెందిన అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ గట్ల కరుణాకర్ రెడ్డి విధి నిర్వహణలో ప్రాణం కోల్పోయాడు. కాగా, మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో కరుణాకర్ రెడ్డి భార్య ప్రియాంకకు సీఎండీ రూ. 20 లక్షల బీమా చెక్కు అందించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ డైరెక్టర్ వి.తిరుపతి రెడ్డి, న్యూఇండియా ఎష్యూరెన్సు కంపెనీ హనుమకొండ డివిజనల్ ఆఫీస్ సీనియర్ డివిజనల్ మేనేజర్ నాగభట్ల జ్యోతిర్మయి, మార్కెటింగ్ మేనేజర్ రాజేశ్, కాంట్రాక్టర్ సైదులు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాఫిక్ బ్లాక్..

● పలు రైళ్ల దారి మళ్లింపు, పాక్షికంగా రద్దు
● డిసెంబర్ 21వ తేదీన అమలు

కాజీపేట రూరల్: కాజీపేట–సికింద్రాబాద్ సెక్షన్ల మధ్య రైల్వే ట్రాఫిక్ బ్లాక్‌తో పలు రైళ్లను పాక్షికంగా రద్దు, దారి మళ్లించి నడిపించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ మంగళవారం తెలిపారు.

పాక్షికంగా రద్దయిన రైళ్లు..

డిసెంబర్ 21వ తేదీన కాజీపేట మీదుగా ప్రయాణించే సికింద్రాబాద్–గుంటూరు (12706) ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్–చర్లపల్లి మధ్య రద్దు, సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్(12757) ఎక్స్‌ప్రెస్,సిర్పూర్‌కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (17234) ఎక్స్‌ప్రెస్ చర్లపల్లి–సికింద్రాబాద్ మధ్య రద్దు, సికింద్రాబాద్–గుంటూరు (17202) ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్–చర్లపల్లి మధ్య రద్దు, కాజీపేట–సికింద్రాబాద్ (67764) పుష్‌పుల్ చర్లపల్లి–సికింద్రాబాద్ మధ్య రద్దు, సికింద్రాబాద్–వరంగల్ (67761) పుష్‌పుల్ సికింద్రాబాద్–చర్లపల్లి మధ్య రద్దు, నాగ్‌పూర్–సికింద్రాబాద్ (20101) ఎక్స్‌ప్రెస్, నాగ్‌పూర్–సికింద్రాబాద్ (20102) ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్–చర్లపల్లి మధ్య రద్దు చేసినట్లు తెలిపారు.

దారి మళ్లించిన రైళ్లు..

డిసెంబర్ 20న విశాఖపట్నం–సికింద్రాబాద్ (12739) ఎక్స్‌ప్రెస్ కాజీపేట, చర్లపల్లి, మౌలాలి, మల్కాజిగిరి మీదుగా, డిసెంబర్ 19న హిసార్–సికింద్రాబాద్ (22738) ఎక్స్‌ప్రెస్ కాజీపేట, చర్లపలి, మౌలాలి, మల్కాజిగిరి, సికింద్రాబాద్ మీదుగా, డిసెంబర్ 20న హౌరా–సికింద్రాబాద్ (12703) ఎక్స్‌ప్రెస్ కాజీపేట, చర్లపల్లి, మౌలాలి, మల్కాజిగిరి, సికింద్రాబాద్ మీదుగా, డిసెంబర్ 21న భద్రాచలం–సికింద్రాబాద్ (17660) కాజీపేట, చర్లపల్లి, మల్కాజిగిరి, సికింద్రాబాద్ మీదుగా, డిసెంబర్ 21న దానాపూర్–సికింద్రాబాద్ (12791) ఎక్స్‌ప్రెస్, విజయవాడ–సికింద్రాబాద్ (12713) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, మౌలాలి, చర్లపల్లి, కాజీపేట మీదుగా, డిసెంబర్ 20న భువనేశ్వర్–ముంబాయి (11020), డిసెంబర్ 21న విశాఖపట్నం–ముంబాయి (18519) ఎక్స్‌ప్రెస్‌లను చర్లపల్లి, మౌలాలి, అముగూడ, సంతనగర్ మీదుగా దారి మళ్లించినట్లు సీపీఆర్వో తెలిపారు.

రేపు జాబ్ మేళా

కాశోజీ సెంటర్: నిరుద్యోగ యువతీయువకులకు ఈనెల 16వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి సాత్విక ఒక ప్రకటనలో తెలిపారు. ఆల్ మార్క్ ఫైనాన్సియల్ సర్వీసెస్‌లో రికవరీ ఏజెంట్, టెలీకాలర్ ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగలవారు తమ విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ములుగు రోడ్డులోని ఐటీఐ ప్రాంగణంలో గల జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జరగనున్న జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు.

హత్య కేసులో మహిళకు జీవిత ఖైదు

వరంగల్ లీగల్ : హత్య కేసులో గౌడుగు కావ్యకు జీవిత ఖైదు, రూ.2 వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ పట్టాభిరామారావు మంగళవారం తీర్పు వెలువరించారు. పోలీసుల కథనం ప్రకారం హనుమకొండ బాలసముద్రానికి చెందిన భూమ రాజు, సిరి దంపతులు, చిట్యాల మండలం నైన్‌పాకకు చెంది ప్రస్తుతం నగరంలోని హంటర్‌రోడ్డులో నివాసముంటున్న గౌడుగు గణేశ్, కావ్య దంపతులు స్నేహితులు. ఈ క్రమంలో 'అచల' చిట్‌ఫండ్‌లో ఏజెంట్‌గా పనిచేస్తున్న గణేశ్ ద్వారా భూమ రాజు రూ.10 లక్షల చిట్టీ వేశాడు. 2021 జనవరిలో చిట్టీ పాట పాడాడు. చిట్టీ ఫండ్ యాజమాన్యం సకాలంలో డబ్బులు చెల్లించలేదు. దీంతో మీ ద్వారా చీటి డబ్బులు చెల్లించామని, అందుకే మీరే బాధ్యత వహించాలని గణేశ్, కావ్య దంపతులపై భూమ రాజు దంపతులు ఒత్తిడి చేశారు. ఈ విషయంపై 2021, సెప్టెంబర్‌లో ఇరు కుటుంబాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ ఘటనతో కోపోద్రిక్తురాలైన కావ్య.. మరోసారి డబ్బుల అడిగితే మీ ఇద్దరిని చంపుతానని బెదిరించింది. అయినా రాజు, సిరి దంపతులు డబ్బుల ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో 2021, సెప్టెంబర్ 3న కావ్య పథకం ప్రకారం రాజు పని చేసే హనుమకొండ డీసీసీ భవన్ వద్ద ఉన్న మొబైల్ రిపేర్ షాప్ వద్దకు వెళ్లింది. అప్పటికే సిరి కూడా అక్కడే ఉంది. ఈ క్రమంలో కావ్య తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ రాజుపై పోసి లైటర్‌తో నిప్పంటించింది. దీంతో ఎవరు నువ్వు అంటూ సిరి.. కావ్య మొహానికి ఉన్న స్కార్ఫ్ తీసే ప్రయత్నం చేసింది. అప్పటికే బాగా వ్యాపించిన మంటల్లో కావ్య స్కార్ఫ్ కూడా కాలింది. దీంతో సిరి తన భర్త రాజును బతికించుకునే ప్రయత్నంలో భాగంగా షాపులోపలికి వెళ్లగా కావ్య అక్కడి నుంచి పరారైంది. అనంతరం తన భర్త గణేశ్‌కు సమాచారం అందించగా ఇద్దరు కలిసి శివనగర్‌లోని తన చిన్నమ్మ ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు పోలీసుల గాలింపు చర్యలు తీవ్రం కావడంతో పారిపోవాలనే ఉద్దేశంతో కాశిబుగ్గ సెంటర్‌కు రాగా గుర్తించిన పోలీసులు ఇద్దరి అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం హత్యా నేరం కింది కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరం రుజువుకావడంతో కావ్య కు జీవిత ఖైదు, రూ.2 వేల జరిమానా విధిస్తూ, ఆమె భర్త గణేశ్‌ను నిర్దోషిగా విడుదల చేస్తున్నట్లు జడ్జి తీర్పులో పేర్కొన్నారు.


గుప్త నిధుల పేరుతో ఘరానా మోసం..

నగం ధరకే బంగారం ఇస్తానని చెప్పి డబ్బులు కాజేసిన కీ'లేడి'

● బాధితుల నిలదీతతో పోలీసులను ఆశ్రయించిన సదరు మహిళ
● మోసపోయామని గ్రహించి రోదిస్తున్న బాధితులు
● స్థానికుల నుంచి రూ. 45 లక్షలు కాజేత

పాలకుర్తి టౌన్: 'నా ఇంట్లో గుప్త నిధులు ఉన్నాయ్... తవ్వకాల్లో బంగారం దొరికింది. ఇది స్వచ్ఛమైన బంగారం. మార్కెట్ కంటే మీకు సంగం ధరకే ఇస్తా' అంటూ ఓ కీ'లేడి' అమాయక మహిళలను బోల్తా కొట్టించి అందిన కాడికి డబ్బులు దోచుకుంది. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. గూడూరు గ్రామానికి చెందిన కీ'లేడి' (మహిళ) సింగపురం గౌరమ్మ రెండు సంవత్సరాల క్రితం ఇల్లు నిర్మించుకుంది. ఈ సమయంలో గుప్తనిధులు (బంగారం)కనిపించగా బయటకు తీశానని, సగం ధరకే ఆ బంగారం ఇస్తానంటూ అదే గ్రామానికి చెందిన మహిళలు మంద రజిత, కొండపర్తి గౌతమికి మాయమాటలు చెప్పింది. అలాగే, ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాలో సుమారు రూ.2కోట్లపైగా అమాయకుల వద్ద డబ్బులు కాజేసినట్లు సమాచారం. అయితే బంగారం ఇవ్వకుండా రెండేళ్లుగా నుంచి తిప్పించుకుంటోంది. దీనిపై విసిగిపోయిన డబ్బులు ఇచ్చిన వారు బంగారం ఇవ్వాలని మంగళవారం నిలదీయడంతో గౌరమ్మ ముందుగానే పోలీసులను ఆశ్రయించింది. బాధిత మహిళలు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎస్సై లింగారెడ్డిని వివరణ కోరగా ఈ మోసంపై బాధితుల నుంచి ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.


రూ. 20 లక్షలు ఇచ్చిన..



స్వచ్ఛమైన బంగారం సగం ధరకే ఇస్తానని గౌరమ్మ నాకు మాయ మాటలు చెప్పింది. నమ్మిన నేను రూ. 20 లక్షలు ఇవ్వగా తీసుకుని వెళ్లింది. పుస్తెలు కుదవ పెట్టి గౌరమ్మకు డబ్బులు ఇచ్చా. ఎన్ని సార్లు అడిగినా బంగారం, డబ్బులు ఇవ్వకపోవడంతో పాటు తిరిగి దూషించింది. ఈ ఘటనలో నా భర్తతో గొడవలు అవుతున్నాయి. అలాగే, టీజీబీలో బ్యాంక్ మిత్ర ఉద్యోగం పోయింది. ఈ విషయంలో పోలీసు ఉన్నతాధికారులు స్పందించి గౌరమ్మపై చర్య తీసుకుని నాకు న్యాయం చేయాలి.

-మంద రజిత, గ్రామస్తురాలు

రూ. 25 లక్షలు తీసుకుంది



మార్కెట్ కంటే సగం ధరకే బంగారం ఇస్తా.. లేకుంటే రోడ్డు కున్న భూమి రాసిస్తా అంటూ గౌరమ్మ నన్ను నమ్మించి బాండ్ పేపర్ రాసి రూ. 25 లక్షలు తీసుకుంది. రెండు సంవత్సరాలు గడిచాయి. డబ్బులు అడిగిన ప్రతీ సారి నన్ను దూషిస్తోంది. గ్రామ పెద్దలకు జరిగిన విషయం చెప్పిన. పట్టించుకోకపోవడంతో పోలీసులను ఆశ్రయించా. అయితే సమస్య వినకుండానే పోలీసులు తిరిగి నన్నే తిట్టి పంపించారు. నాకు న్యాయం చేయాలి.

-కొండపర్తి గౌతమి, గ్రామస్తురాలు

మల్లేశ్ అంత్యక్రియలు పూర్తి

● పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి మృతదేహం తరలింపు
● పోలీసుల నిఘాలో ముగిసిన దహన సంస్కారాలు


మల్లేశ్ భార్య హైమ, పిల్లలు,మల్లేశ్ అంతిమయాత్రలో గ్రామస్తులు

దేవరుప్పుల : రిమాండ్ ఖైదీ వారాల మల్లేశ్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. జైళ్ల శాఖ నిబంధనల మేరకు మంగళవారం పోస్టుమార్టం పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని పోలీసుల నిఘాలో స్వగ్రామం సింగరాజుపల్లికి తరలించి అదేరోజు సాయంత్రం అంత్యక్రియలు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లికి చెందిన వారాల మల్లేశ్‌కు ఇదే గ్రామానికి చెందిన మిత్రుడు పడకంటి బ్రహ్మచారితో సరదాగా గొడవ జరిగింది. ఇందులో కర్ర తగిలి బ్రహ్మచారి చేయి విరిగింది. ఈ విషయమై పీఎస్‌లో కేసు నమోదు కాగా హాస్పిటల్ నివేదిక ఆధారంగా మల్లేశ్‌ను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించింది. దీంతో మనస్తాపానికి గురైన మల్లేశ్ జనగామ సబ్ జైలులో బ్లీచింగ్ పౌడర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పోలీసుల వ్యూహాత్మకంతో ప్రశాంతంగా అంత్యక్రియలు..

రిమాండ్ ఖైదీ మల్లేశ్ ఆత్మహత్య తీరుపై గ్రామస్తులు కోపోద్రిక్తులై ఇప్పటికే జనగామ జైలు ఎదుట ఆందోళన చేపట్టిన విషయం విధితమే. ఈ తరుణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుల వ్యూహాత్మకంగా వ్యవహరించడంతో మల్లేశ్‌అంత్యక్రియలు ప్రశాంతంగా ముగిశాయి. వరంగల్ ఎంజీఎంలో ఉస్మానియా, గాంధీ, వరంగల్ కేఎంసీ వైద్య బృందం పర్యవేక్షణలో పోస్టుమార్టం పూర్తయింది. అనంతరం జనగామ సీఐ సత్యనారాయణ రెడ్డి పర్యవేక్షణలో మల్లేశ్ మృతదేహాన్ని జనగామ మీదుగా కాకుండా ఇతర మార్గాల ద్వారా సింగరాజుపల్లికి తరలించగా కుటుంబీకులు అంత్యక్రియలు పూర్తి చేశారు. పాలకుర్తి సీఐ జానకీరామిరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఎలాంటి ఆందోళనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు.

హైమా కుటుంబాన్ని ఆదుకునేది ఎవరు?

మల్లేశ్ ఆత్మహత్యతో హైమ కుటుంబాన్ని ఎవరు ఆదుకుంటారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్న మల్లేశ్, హైమా దంపతులకు ఇప్పటికే ఇద్దరు కూతుళ్లు కాగా ప్రస్తుతం హైమా మరోసారి గర్భం దాల్చింది. ఈ క్రమంలో మల్లేశ్ ఆత్మహత్యతో ఆ కుటుంబాన్ని ఆదుకునేది ఎవరని బంధువులు, గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం, అధికారులు స్పందించి హైమా కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ఇప్ప వీరారెడ్డి, సింగారపు రమేశ్, తదితరులు డిమాండ్ చేశారు.



శ్రీలంక-న్యూజిలాండ్ మ్యాచ్ వర్షార్పణం

కొలంబో: మహిళల వన్డే ప్రపంచకప్‌లో మరో పోరు వర్షార్పణమైంది. కొలంబోలో నిరంతరాయంగా కురుస్తున్న వానలతో రెండోసారి శ్రీలంక ఖాతాలో ఫలితం తేలని మ్యాచ్ చేరింది. మంగళవారం న్యూజిలాండ్, శ్రీలంక మధ్య జరిగిన లీగ్ మ్యాచ్‌ను ఒక ఇన్నింగ్స్ తర్వాత భారీ వర్షం కారణంగా రద్దు చేయాల్సి వచ్చింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లంక 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. నీలాక్షిక సిల్వ (28 బంతుల్లో 55 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), చమరి అటపట్టు (72 బంతుల్లో 53; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించగా... హాసిని పెరీరా (44),విష్మి గుణరత్నే (42) రాణించారు. కివీస్ బౌలర్లలో సోఫీ డివైన్ 3, బ్రీ ఇల్లింగ్ 2 వికెట్లు పడగొట్టారు. అయితే లంక బ్యాటింగ్ ముగిసిన తర్వాత మొదలైన వర్షం ఆ తర్వాత కొంచెం కూడా తెరిపిని వ్వలేదు. దాంతో న్యూజిలాండ్‌కు బ్యాటింగ్ చేసే అవకాశమే రాలేదు. చివరకు అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 4న కొలంబోలోనే శ్రీలంక, ఆస్ట్రేలియా జట్ల మధ్య మ్యాచ్ కూడా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. కొలంబోలోనే నేడు జరిగే మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో ఇంగ్లండ్ ఆడుతుంది.

‘ప్రపంచకప్ టోర్నీకి చాలా సమయం ఉంది’



- రోహిత్, కోహ్లి భవిష్యత్తుపై గంభీర్ వ్యాఖ్య
- రాబోయే సిరీస్‌పైనే దృష్టి పెట్టామన్న హెడ్ కోచ్


న్యూఢిల్లీ: భారత్, ఆస్ట్రేలియా మధ్య ఈ నెల 19 నుంచి మూడు వన్డేల సిరీస్ జరగనుంది. సిరీస్ ఫలితంకంటే విరాట్ కోహ్లి, రోహిత్ శర్మల గురించే ఇప్పుడు చర్చ జరుగుతోంది. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత మళ్లీ ఈ సిరీస్‌తోనే బరిలోకి దిగుతున్న వీరిద్దరు ఇప్పటికే రెండు ఫార్మాట్‌ల నుంచి రిటైర్ అయి ఒక్క వన్డేలే ఆడుతున్నారు. ఈ క్రమంలో రోహిత్‌ను వన్డే కెప్టెన్సీ నుంచి కూడా తప్పించారు. ఈనేపథ్యంలో తాజా చర్చపై భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఇప్పటికిప్పుడు వారిద్దరి భవిష్యత్తుపై తానేమీ చెప్పలేనని స్పష్టం చేశాడు. ‘వన్డే వరల్డ్‌కప్‌కు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. కాబట్టి భవిష్యత్తుకంటే ప్రస్తుతంపైనే దృష్టి పెట్టడం ముఖ్యమని నేను భావిస్తా. వారిద్దరు అత్యుత్తమ ఆటగాళ్లు అనడంలో సందేహం లేదు. పునరాగమనం చేస్తున్న వారి అనుభవం ఆస్ట్రేలియాలో పనికొస్తుంది. వీరిద్దరు బాగా ఆడి సిరీస్ విజయంలో భాగమవుతారని ఆశిస్తున్నా’ అని గంభీర్ చెప్పాడు.

గిల్‌కు కెప్టెన్సీ అర్హత ఉంది...

భారత టెస్టు కెప్టెన్సీతో పాటు వన్డేలకు కూడా సారథ్యం వహించే సత్తా, అర్హత శుబ్‌మన్ గిల్‌కు ఉన్నాయని, ఈ హక్కును అతను సాధించుకున్నాడని గంభీర్ ప్రశంసించాడు. ‘కెప్టెన్‌గా గిల్‌ను నియమించి ఎవరూ ఔదార్యం చూపించలేదు. అతడికి ఆ అర్హత ఉంది. కోచ్‌గా కూడా నేను ఈ మాట చెప్పగలను. ప్రపంచ క్రికెట్‌లో అతి కఠినమైన పర్యటనల్లో ఇంగ్లండ్ ఒకటి. అలాంటి చోట ఐదు టెస్టులూ గట్టిగా నిలబడి సిరీస్‌ను సమం చేసుకోగలగడం చిన్న విషయం కాదు. బ్యాటింగ్‌లోనూ అదరగొట్టడంతో పాటు జట్టును సమర్థంగా నడిపి వన్డేల్లోనూ సారథి కాగల హక్కును అతను సాధించాడు’ అని గంభీర్ అన్నాడు. 2027 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ గురించి ఇప్పుడే మాట్లాడటం అనవసరమని, వరుసగా విజయాలు సాధించడమే తమ లక్ష్యమని అతను స్పష్టం చేశాడు. భారత జట్టు నవంబర్ 9న ఆస్ట్రేలియాతో చివరి టిస్టు ఆడనుండగా... నవంబర్ 14 నుంచి కోల్‌కతాలో దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు జరుగుతుంది. అయితే ప్రొఫెషనల్ క్రికెటర్లు తక్కువ సమయంలో పరిస్థితులకు తగినట్లుగా మార్చుకోగలరని విశ్వాసం వ్యక్తం చేసిన గంభీర్... టెస్టు టీమ్‌లో మాత్రమే సభ్యులైన ఆటగాళ్లు రంజీ ట్రోఫీలో బరిలోకి దిగాలని సూచించాడు. వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ గెలవడం పట్ల కోచ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. అయితే భారత్‌లో కూడా పేస్ బౌలర్లకు కూడా కాస్త అనుకూలించే విధంగా బౌన్సీ పిచ్‌లు ఉంటే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశాడు.

హర్షిత్ రాణాపై అనవసర విమర్శలు...

భారత జట్టు తరఫున మూడు ఫార్మాట్‌లలోనూ వరుసగా అవకాశాలు పొందుతున్న పేస్ బౌలర్ హర్షిత్ రాణాపై ఇటీవల సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రతిభావంతుడు కాకపోయినా... ఢిల్లీకి చెందినవాడు కావడంతో పాటు గంభీర్ ఐపీఎల్ టీమ్ కేకేఆర్‌కు మెంటార్‌గా ఉన్న సమయంలో సాన్నిహిత్యం వల్లే రాణాకు జట్టులో చోటు దక్కుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ కూడా ఇటీవల ఇదే మాట అన్నాడు. తాజా విమర్శలపై గంభీర్ తీవ్రంగా స్పందించాడు. ఈ వివాదంలో హర్షిత్‌కు అతను పూర్తి మద్దతు పలికాడు. ‘యూట్యూబ్‌లో వ్యూస్ కోసం కొందరు ఒక 23 ఏళ్ల యువ ఆటగాడిని లక్ష్యంగా చేసుకున్నందుకు సిగ్గుపడాలి. రాణా తండ్రి మాజీ క్రికెటర్ కాదు. సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ కానీ ఎన్ఆర్ఐ కానీ కాదు. అతను తన ప్రతిభను నమ్ముకొనే క్రికెట్ ఆడుతున్నాడు. ఒక ఆటగాడి ప్రదర్శన బాగా లేకుండా విమర్శించవచ్చు కానీ ఇలా వ్యక్తిగత విమర్శలు చేస్తారా. కావాలంటే నన్ను విమర్శించండి. నేను దానిని భరించగలను. కానీ 23 ఏళ్ల ఆటగాడిపై ఇది మానసికంగా ఎలాంటి ప్రభావం చూపిస్తుందో ఆలోచించారా. భారత క్రికెట్ జట్టు ఎవరిదో సొంత ఆస్తి కాదు. మన జట్టు గెలవాలని భావించే అందరిది ఈ జట్టు అని మర్చిపోవద్దు’ అని గంభీర్ వ్యాఖ్యానించాడు.



లాంఛనం ముగిసింది

రెండో టెస్టులో 7 వికెట్లతో భారత్ జయభేరి

వెస్టిండీస్‌పై 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ ● కేఎల్ రాహుల్ అర్ధశతకం

న్యూఢిల్లీ: వెస్టిండీస్ మూడో **రోజు ఫాలోఆన్‌లో** రెండో ఇన్నింగ్స్‌తో మొదలుపెట్టిన **పోరాటం** నాలుగో రోజూ కొనసాగడం... **ఇద్దరి సెంచరీల** మైలురాయితో ఆతిథ్య భారత్ **ముందు లక్ష్యాన్ని** ఉంచడంతో ఈ చివరి టెస్టు **చివరి రోజుదాకా** సాగింది. మంగళవారం ఆటలో **భారత్ సులువైన** లక్ష్య ఛేదనలో మిగిలిపోయిన **లాంఛనాన్ని తొలి** సెషన్‌లోనే పూర్తి చేసింది. అలా **రెండో టెస్టులో** టీమిండియా 7 వికెట్ల తేడాతో **వెస్టిండీస్‌పై ఘనవి** జయం సాధించింది. భారత్ **రెండో ఇన్నింగ్స్‌లో** 35.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి **124 పరుగులు చేసి** గెలిచింది. ఓవర్‌నైట్ బ్యాటర్ కేఎల్ **రాహుల్ (108** బంతుల్లో 58 నాటౌట్; 6 ఫోర్లు, **2 సిక్స్‌లు) అర్ధ** శతకం సాధించాడు. రోస్టన్ చేజ్ **2 వికెట్లు తీయగా...** వారికెన్‌కు ఒక వికెట్ దక్కింది. **రవీంద్ర జడేజాకు** ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ లభించింది**. రెండు టెస్టుల్లో** ఆడిన ఒకే ఇన్నింగ్స్‌తో శతక్కొట్టిన **జడేజా 8 వికెట్లు** కూడా తీశాడు. కాగా ఈ రెండో **టెస్టులో 8 వికెట్లు** (5/82, 3/104) పడగొట్టిన **కుల్దీప్ యాదవ్‌కు** ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు దక్కింది.

గంటసేపు పైగా...

ఆఖరి రోజు మిగిలిపోయిన 58 పరుగులు చేసేందుకు 63/1 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన **భారత్ కాసేపటికే సాయి సుదర్శన్ (76 బంతుల్లో 39; 5 ఫోర్లు) వికెట్‌ను కోల్పో**యింది. ఓవర్‌నైట్ బ్యాటర్ రాహుల్‌కు జతయిన కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (13) కూడా వికెట్‌ను సమర్పించుకోవడంతో లాంఛనం పూర్తి చేసేందుకు భారత్ గంటసేపు పైగానే ఆడాల్సి వచ్చింది. క్రీజులోకి ధ్రువ్ జురేల్ (6 నాటౌట్; 1 ఫోర్) రాగా... 102 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న రాహుల్ అజేయంగా నిలిచి భారత్‌ను గెలిపించాడు. **కేఎల్ రాహుల్ తొలి టెస్టులో శతకంతో కదంతొక్కాడు. ఈ క్లీన్‌స్వీప్** విజయంతో టీమిండియా ‘ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్’ పాయింట్ల పట్టికలో 61.9 శాతంతో మూడో స్థానాన్ని పటిష్టం చేసుకుంది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 518/5 డిక్లేర్డ్; **వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్:** 248; **వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్:** 390; **భారత్ రెండో ఇన్నింగ్స్:** యశస్వి జైస్వాల్ **(సి) ఫిలిప్ (బి)** వారికెన్ 8; రాహుల్ (నాటౌట్) **58; సాయి సుదర్శన్** (సి) షై హోప్ (బి) చేజ్ 39; గిల్ (సి) గ్రీవెస్ (బి) చేజ్ 13; ధ్రువ్ జురేల్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం** (35.2 ఓవర్లలో 3 వికెట్లకు) 124. **వికెట్ల పతనం:** 1-9, 2-88, 3-108. **బౌలింగ్:** సీల్స్ 3-0-14-0, వారికెన్ 15.2-4-39-1, పియర్ 8-0-35-0, చేజ్ 9-2-36-2.

10 వెస్టిండీస్‌పై భారత్ వరుస సిరీస్ విజయాల సంఖ్య. దక్షిణాఫ్రికా పేరిట ఉన్న ఒకే జట్టుపై వరుస సిరీస్ విజయాల రికార్డును భారత్ సమం చేసింది. దక్షిణాఫ్రికా జట్టు కూడా విండీస్‌పై వరుసగా పది సిరీస్‌లలో గెలిచింది.

14 ఢిల్లీ గడ్డపై టీమిండియా అజేయ రికార్డు. భారత్ 1993 నుంచి ఇక్కడ ఆడిన 14 మ్యాచ్‌ల్లో ఒక్కటి కూడా ఓడలేదు. 12 టెస్టులు గెలువగా, రెండు ‘డ్రా’ అయ్యాయి.

122 సొంతగడ్డపై భారత్ గెలిచిన టెస్టులు. సంప్రదాయ క్రికెట్ చరిత్రలోనే ఇది మూడో అత్యధికం. ఆస్ట్రేలియా (262), ఇంగ్లండ్ (241) మాత్రమే ముందున్నాయి.

భారత్-పాకిస్తాన్ హాకీ మ్యాచ్ ‘డ్రా’



జొహోర్ (మలేసియా): సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ అండర్-21 అంతర్జాతీయ జూనియర్ హాకీ టోర్నీలో భారత్ ఖాతాలో తొలి ‘డ్రా’ చేరింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో మంగళవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌ను భారత జట్టు 3-3 గోల్స్‌తో ‘డ్రా’గా ముగించింది. భారత్ తరఫున అరిజీత్ సింగ్ (43వ నిమిషంలో), ఆనంద్ (47వ నిమిషంలో), మన్‌మీత్ (53వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. పాకిస్తాన్ తరఫున హన్నాన్ షాహిద్ (5వ నిమిషంలో) ఒక గోల్.. సుఫియాన్ ఖాన్ (39వ, 55వ నిమిషంలో) రెండు గోల్స్ చేశాడు. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో భారత్ ఏడు పాయింట్లతో ఆస్ట్రేలియాతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.

ఆసియా కప్ ఆశలు గల్లంతు

సింగపూర్ చేతిలో ఓడిన భారత్



మార్గావ్: ఆసియా కప్-2027 ఫుట్‌బాల్ టోర్నీకి అర్హత సాధించడంలో భారత్ విఫలమైంది. క్వాలిఫికేషన్ టోర్నీలో రెండో పరాజయంతో జట్టు నిష్క్రమణ ఖాయమైంది. మంగళవారం జరిగిన గ్రూప్ ‘సి’ మ్యాచ్‌లో సింగపూర్ 2-1 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించింది. సింగపూర్ తరఫున సంగ్ యు యంగ్ 44వ, 58వ నిమిషాల్లో గోల్స్ నమోదు చేశాడు. భారత్ తరఫున లాలియన్‌జులా చాంగ్తే 14వ నిమిషంలో ఏకైక గోల్ సాధించాడు. గ్రూప్ ‘సి’లో టీమిండియా చివరి స్థానంలో ఉంది. గ్రూప్ విజేత మాత్రమే ఆసియా కప్‌కు అర్హత సాధిస్తుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అందుకు తెగించే ఇక్కడ ఉన్నాను



- సిద్ధు జొన్నలగడ్డ

“నేను ఏ సినిమా చేసినా నాపై నాకే ఎక్స్‌పెక్టేషన్స్ ఎక్కువగా ఉంటాయి. ఇప్పుడే డీటీఎస్‌లో ‘తెలుసు కదా’ సినిమా చూశాను. చాలా ఎగ్జైట్ అయ్యాను. ఇదే ఎగ్జైట్ మెంట్‌ని ఆడియన్స్ కూడా ఫీలవుతారని అనుకుంటున్నా” అని సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన చిత్రం ‘తెలుసు కదా’. ఈ చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటించారు. నీరజా కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకరుల సమావేశంలో సిద్ధు జొన్నలగడ్డ చెప్పిన విశేషాలు.

● ‘తెలుసు కదా’లో నేను వరుణ్ పాత్రలో కనిపిస్తాను. స్క్రీన్‌పై వరుణ్ మామూలుగా కనిపిస్తున్నప్పటికీ అతని ఆలోచనలు చాలా ర్యాడికల్‌గా ఉంటాయి. ఈ క్యారెక్టరైజేషన్ చూసి, ఆడియన్స్ షాక్ అవుతారనుకుంటున్నాను. ఫస్టాఫ్‌లో శ్రీనిధి, సెకండాఫ్‌లో రాశీ క్యారెక్టర్స్ బలంగా కనిపిస్తాయి. వీరిద్దరి కంటే వరుణ్ రోల్ ఇంకా స్ట్రాంగ్‌గా ఉంటుంది. ● కొత్తవాళ్లతో వర్క్ చేయడం రిస్క్‌తో కూడుకున్న పనే. కానీ రిస్క్ ఉన్న చోటే రివార్డు కూడా ఉంటుంది. నీరజగారి ఐడియాలు బాగున్నాయి. కాకపోతే హీరో క్యారెక్టరైజేషన్‌ను కాస్త ఇంప్రూవ్ చేసిన తర్వాత షూటింగ్‌కు వెళ్లాం. డబ్బుల గురించి ఆలోచించకుండా మంచి సినిమా తీయమని ప్రోత్సహించే నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌గారు. అందుకే విజువల్‌గా ‘తెలుసు కదా’ స్క్రీన్‌పై పెద్ద సినిమాలా కనిపిస్తుంది. ● సినిమా మేకింగ్‌లో జోక్యం చేసుకుంటున్నానంటే నా కోసం ఎవరూ కథలు రాయలేదు. నా కథలు నేనే రాసుకున్నాను. ఫిల్మ్ మేకింగ్ గురించిన ప్రతి విషయాన్ని నేర్చుకున్నాను. ఒకవేళ సినిమా హిట్టయితే డైరెక్షన్, మ్యూజిక్, సినిమాటోగ్రఫీ, హీరో హీరోయిన్ల యాక్టింగ్... ఇలా అన్నీ బాగున్నాయి అంటారు. అదే ఫ్లాప్ అయితే నేను ఇన్‌వాల్వ్ అయ్యాను కాబట్టి పోయిందని నిందిస్తారు. ఇందుకు తెగించే ఇక్కడ ఉన్నాను. ● నేను హీరోగా నటించిన ‘డీజే టిల్లు, డీజే టిల్లు 2’ సినిమాలు సూపర్‌హిట్స్‌గా నిలిచాయి. ఈ డీజే టిల్లు క్యారెక్టరైజేషన్ ‘హై’ వల్ల నా సినిమాలు ఒకట్రెండు ఫలితాలు తారుమారు కావొచ్చని ముందే ఊహించాను. ‘జాక్’ సినిమా ఆడియన్స్‌ను మెప్పించలేకపోయింది. అప్పుడు కొరటాల శివగారు ఫోన్ చేసి, ‘డీజే టిల్లు’ హిట్స్‌తో ఆల్ టైమ్ ‘హై’ చూశావ్... ‘జాక్’తో ‘లో’ చూశావ్. ఇక నువ్వేం చేసినా ఆ రెండింటి మధ్య చూస్తావు” అన్నారు. ఆ మాటలు నాలో కొత్త ఆలోచనలు కలిగించాయి. ● ఇటీవల ఓ ఇబ్బందికర ప్రశ్న ఎదుర్కొన్నాను. సినిమాల్లో హీరో పోలీసాఫీసర్ అయితే రియల్‌గానూ పోలీస్‌గా ఉంటారా? హీరో డ్రగ్ ఎడిక్ట్ అయితే రియల్ లైఫ్‌లోనూ డ్రగ్ ఎడిక్టై ఉంటారా? అది సినిమా. హీరో ఆన్సర్ చేసే పొజిషన్‌లో ఉన్నాడు కదా అని ఏది పడితే అది అడిగేయడం కరెక్ట్ కాదు. ● ‘తెలుసు కదా’ ప్రమోషన్స్‌లో భాగంగా రవితేజగారి బయోపిక్ చేయాలని ఉందని చెప్పాను... చూడాలి. ఇక నాకు డైరెక్టర్‌గా మారే ఆలోచన కూడా ఉంది. హీరోగా నా తర్వాతి సినిమా ‘బ్యాడాస్’ కొత్తగా ఉంటుంది. మల్లిక్ రామ్‌తో ఓ సినిమా చేయాల్సి ఉంది.

ఫ్లాష్‌బ్యాక్‌లో యాక్షన్



● ఎన్టీఆర్

ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘ఎన్టీఆర్ నీల్’ (వర్కింగ్ టైటిల్). ‘కేజీఎఫ్, సలార్’ చిత్రాల తర్వాత డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్ కోసం ఎన్టీఆర్ ఓ డిఫరెంట్ లుక్‌లోకి మారారని టాక్. ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలు సినిమాలో హైలెట్‌గా నిలవనున్నాయట. ఇదిలా ఉంటే... ఈ సినిమాకి ‘డ్రాగన్’ అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ఫిల్మ్‌నగర్ టాక్. ఈ చిత్రం 2026 జూన్ 25న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

‘వార్ 2’ రికార్డ్ : హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ ముఖ్య తారలుగా నటించిన చిత్రం ‘వార్ 2’. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 14న విడుదలైంది. ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా ఈ నెల 6 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. అత్యధిక మంది వీక్షించిన చిత్రాల జాబితాలో ‘వార్ 2’ చిత్రం టాప్‌లో ఉన్నట్లు ప్రముఖ మీడియా సంస్థ ఆర్మాక్స్ తెలిపింది. ఈ నెల 6 నుంచి 12 వరకూ 3.5 మిలియన్ల మంది వీక్షించినట్లు ఆ సంస్థ ప్రకటించింది. దీంతో గత వారం ఇండియాలోనే ఎక్కువ మంది చూసిన సినిమాగా ‘వార్ 2’ నిలిచింది.

కుందేలుకి కోపం వస్తే..!



● చిరంజీవి, నయనతార

“మీసాల పిల్లా నీ ముక్కు మీద కోపం కొంచెం తగ్గాలే పిల్లా... మీసాల పిల్లా నీ ముక్కు మీద కోపం కొంచెం తగ్గాలే పిల్లా... పొద్దునలేచిన దగ్గర్నుంచి డైలీ యుద్ధాలా... మొగుడు పెళ్లాలంటే కంకీ కొడవల్లా... అట్ట కన్నెర చెయ్యాలా... కారాలే నూరేలా...” అంటూ సాగుతుంది ‘మీసాల పిల్లా...’ పాట. చిరంజీవి హీరోగా నటిస్తున్న ‘మన శంకరవరప్రసాద్‌గారు’ సినిమాలోనిది ఈ పాట. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందులో చిరంజీవి, నయనతార భార్యా భర్తలుగా కనిపిస్తారు. ఈ సినిమాలోని ‘మీసాల పిల్లా...’ పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా ఉదిత్ నారాయణ్ ఆలపించారు. “ఇట్ట దుమ్మెత్తి పొయ్యాలా దూరాలె పెంచేలా... కుందేలుకి కోపం వస్తే చిరుతకు చెమటలు పట్టేలా...’ అంటూ ఈ పాట సాగుతుంది. అర్చన సమర్పణలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ‘మన శంకరవరప్రసాద్‌గారు’ సినిమా వచ్చే సంక్రాంతి సందర్భంగా విడుదల కానుంది.

కబడ్డి... కబడ్డి



● ధృవ్

ప్రముఖ తమిళ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం ‘బైసన్’. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. పా. రంజిత్ సమర్పణలో నీలం స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్‌పై సమీర్ నాయర్, దీపక్ సెగల్, పా. రంజిత్, అదితీ ఆనంద్ నిర్మించిన ఈ చిత్రం తమిళంలో ఈ నెల 17న విడుదల కానుంది. తెలుగులో జగదాంబే ఫిలిమ్స్ పై బాలాజీ ఈ నెల 24న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రానా రిలీజ్ చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ– “1990 బ్యాక్‌డ్రాప్‌లో కబడ్డి నేపథ్యంలో రూపొందిన చిత్రం ‘బైసన్’. ట్రైలర్ ఎంత ఆసక్తికరంగా ఉందో సినిమా కూడా థ్రిల్లింగ్ అంశాలతో అందర్నీ ఆకట్టుకునేలా ఉంటుంది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ సినిమాలకు తెలుగులో మంచి ఆదరణ దక్కుతుంది. కబడ్డి నేపథ్యంలో రాబోతున్న మా సినిమా కూడా మంచి విజయం అందుకుంటుందని నమ్ముతున్నాను” అన్నారు.

ఫ్యామిలీ ఆడియన్స్ చూడొచ్చు

- నిర్మాత రాజేశ్ దండ

“నిర్మాతగా ‘కె-ర్యాంప్’ నాకు ఆరవ సినిమా. నా గత ఐదు చిత్రాల్లో ఎక్కడా ఇబ్బందికరమైన పదాలు లేవు. ఒక్కో సినిమా కథ ఒక్కోలా ఉంటుంది. అంతే కానీ కావాలని కొన్ని పదాలు పెట్టి, ప్రేక్షకులను థియేటర్స్‌కు రప్పించాలని అనుకోను. అలాంటి సినిమాలు నేను తీయను. ‘కె-ర్యాంప్’ చిత్రం ఫ్యామిలీ ఆడియన్స్ చూడొచ్చు” అని చెప్పారు నిర్మాత రాజేశ్ దండ. కిరణ్ అబ్బవరం, యుక్తీ తరేజా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘కె-ర్యాంప్’. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాజేశ్ దండ మాట్లాడుతూ– “ఈ చిత్రంలో కిరణ్‌గారు కుమార్ అబ్బవరం అనే పాత్రలో నటించారు. ఈ సినిమా కథ విని ఎగ్జైట్ అయ్యాను. మా సినిమాకు సెన్సార్ వాళ్ళు ‘ఏ’ సర్టిఫికెట్ ఇచ్చింది ఇందులో ఇబ్బందికరమైన పదాలు ఉన్నాయని కాదు. ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలు ఉన్నాయి. వీటిని చూసి ఎవరైనా ఆడియన్స్ ప్రేరణ పొందుతారేమోనని ‘ఏ’ సర్టిఫికెట్ ఇచ్చారు... అంతే. వల్గారిటీ లేదు. ఇక ‘కె-ర్యాంప్’ సినిమా కిరణ్‌గారి వన్ మ్యాన్ షోలా ఉంటుంది. ఇంట్రవెల్ బ్యాంగ్ బ్లాస్ట్ అవుతుంది. ఈ సినిమాతో నిర్మాత శివతో నాకు మంచి ప్రయాణం మొదలైంది. నా మీద నమ్మకంతో కథ వినకుండానే ఈ సినిమాలో భాగమయ్యారు శివ. ప్రస్తుతం మా బ్యానర్‌లో హీరోయిన్ సంయుక్తతో ఓ సినిమా చేస్తున్నాం. అలాగే ‘అల్లరి’ నరేశ్‌గారితో ఓ సినిమా ఉంది” అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ– “టార్గెటెడ్ ట్రోలింగ్ గురించి బన్నీ వాసుగారు మాట్లాడిన విషయాలను నేను ఫాలో కాలేదు. పూర్తి విషయాలు తెలిసిన తర్వాత స్పందిస్తాను” అని చెప్పారు. “కిరణ్‌గారిని ఈ సినిమాలో కొత్తగా చూస్తారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ సినిమా ఉంటుంది” అన్నారు శివ బొమ్మకు.



● రాజేశ్ దండ, శివ బొమ్మకు

అరి కథతో పుస్తకం తీసుకొస్తున్నాం

- జయశంకర్

“అరిషడ్వర్గాల గురించి ఎంతోమంది గొప్పవాళ్లు చెబుతూ వచ్చారు. కానీ, వాటికి పరిష్కారం చూపించలేదు. ఈ ఆలోచనతోనే ‘అరి’ చిత్రాన్ని రూపొందించాను. ఈ సినిమా కథతో త్వరలోనే పుస్తకాన్ని తీసుకొస్తున్నాం” అని దర్శకుడు జయశంకర్ చెప్పారు. వినోద్ వర్మ, అనసూయ, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘అరి’. రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (ఆర్‌వీ రెడ్డి) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి. శేషురెడ్డి మారంరెడ్డి, డా. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్ రెడ్డి నిర్మించారు. ఏషియన్-సురేష్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 10న విడుదలైంది. ఈ సినిమా సక్సెస్ మీట్‌లో జయశంకర్ మాట్లాడుతూ– “మా సినిమాకి స్లోగా ఓపెనింగ్స్ వచ్చి పికప్ అవుతుందనుకున్నాం. అయితే శ్రీకాంత్ అయ్యంగార్ ఇష్యూ వల్ల రెండో రోజునే మా సినిమా పోస్టర్స్‌ను థియేటర్స్ దగ్గర చించివేయడం బాధగా అనిపించింది. ఆ తర్వాత ఆ వివాదం సద్దుమణిగింది. మూడో రోజు నుంచి మా సినిమాకి ప్రేక్షకుల సందడి కనిపించింది” అని పేర్కొన్నారు. “‘పేపర్ బాయ్’లో అవకాశం ఇచ్చి, నాకు గుర్తింపు తీసుకొచ్చిన జయశంకర్‌గారు ఇప్పుడు ‘అరి’లో లీడ్ రోల్ ఇచ్చి మరింత గుర్తింపు తెచ్చుకునేలా చేసినందుకు థ్యాంక్స్” అని నటుడు వినోద్ వర్మ తెలిపారు.



● వినోద్ వర్మ, జయశంకర్

సస్పెన్స్ సీమంతం



● సుధాకర్, ఆర్పీ పట్నాయక్

“ప్రస్తుతం సమాజంలో నెలకొన్న ఓ ప్రధానమైన సమస్య నేపథ్యంలో రూపొందిన ‘సీమంతం’ సినిమా మంచి విజయం సాధించాలి. ‘ఎద మాటున...’ పాట బాగుంది. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి” అని సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ తెలిపారు. వజ్రయోగి, శ్రేయ భర్తీ జంటగా సుధాకర్ పాణి దర్శకత్వం వహించిన చిత్రం ‘సీమంతం’. ప్రశాంత్ టాటా నిర్మించిన ఈ సినిమా నవంబరు 14న విడుదల కానుంది. ఎస్. సుహాస్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి ‘ఎద మాటున...’ అంటూ సాగే పాటని ఆర్పీ పట్నాయక్ రిలీజ్ చేశారు. “సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ‘సీమంతం’. గర్భవతులపై దాడుల నేపథ్యంలో కథ సాగుతుంది” అని యూనిట్ పేర్కొంది.